క్లుప్తంగా

ఉచిత డీఎస్సీ శిక్షణ



డీఎస్సీ శిక్షణకు హాజరైన అభ్యర్థులు

సీతంపేట: స్థానిక అంబేడ్కర్ భవన్‌లో అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం డీఎస్సీ ఉచిత శిక్షణ ప్రారంభించారు. సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డు కల్యాణ రావు, జె.వి.ప్రభాకర్ హాజరై శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు ఉచిత శిక్షణకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొదటి రోజు సుమారు వంద మంది శిక్షణకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం వైస్ చైర్మన్ డి.అచ్చం నాయుడు, డైరెక్టర్ ఆర్.శంకర్, ఉపాధ్యక్షుడు ఎం.చంటి, సంయుక్త కార్యదర్శి బి.గౌతం బాబు,, ఫ్యాకల్టీ పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు పటిష్ట చర్యలు



మాట్లాడుతున్న జోన్-3 సహాయ వైద్యాధికారి ప్రసాదరావు

సీతంపేట: మలేరియా, డెంగ్యూ జ్వరాలను వ్యాప్తి చేసే దోమల నియంత్రణకు యాంటీ లార్వా ఆపరేషన్లు సమర్థవంతంగా నిర్వహించాలని జోన్ 3 సహాయ వైద్యాధికారి బి.ప్రసాద రావు అన్నారు. గురువారం మలేరియా, డెంగ్యూ జ్వరాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ జ్వరాల నియంత్రణకు స్ప్రేయింగ్, ఫాగింగ్ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. దోమలు పెరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా జ్వరాలు నమోదు కాకుండా ముందస్తు నివారణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఐ బంధం శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు శివ, రాంబాబు, నాయుడు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెలో అంతా పాల్గొనాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నేతలు

కంచరపాలెం: కార్మికుల హక్కులను కాల రాసే విధంగా కేంద్ర ప్రభుత్వ లేబర్ కోడ్లు ఉన్నాయని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.తిరుపతిరావు ధ్వజమెత్తారు. జ్ఞానాపురం జేఎస్ఎస్‌యూఆర్ఎం కాలనీలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 20న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె, గ్రామీణ హర్తాళ్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చాయని, అన్ని వర్గాల కార్మికులు, ఉద్యోగులు, రైతులు, వ్యవసాయ కూలీలు ఈ సమ్మెలో పాల్గొనాలని కోరారు. ఐఎఫ్‌టీయూ, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీలు విడుదల చేసిన గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు నారాయణరావు, జయమ్మ, ఈసరపు లక్ష్మి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద సంస్థలో అన్నదానం



అన్నదానం చేస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్, ద్రోణంరాజు శ్రీవత్సవ్, మక్సూద్ అహ్మద్ తదితరులు

దాబాగార్డెన్స్: స్వామి వివేకానంద సీనియర్ సభ్యుడు దూడ రాజు రెండో వర్ధంతిని పురస్కరించుకుని గురువారం సంస్థ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రాజు చిత్రపటానికి సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సంఘ సేవకులు ద్రోణంరాజు శ్రీవత్సవ్, మక్సూద్ అహ్మద్, పలువురు సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివేకానంద సంస్థకు చేసిన సేవలు గుర్తు చేసుకుని రాజు గొప్పదనం తెలిపారు.

డెంగ్యూతో జాగ్రత్త



- ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువు ఏడిస్ దోమలు
- వగటిపూట కుట్టే ఈ దోమలతో డెంగ్యూ జ్వరాల వ్యాప్తి
- నిర్ధారణ, చికిత్స ఆలస్యం అయితే ప్లేట్‌లెట్లు తగ్గి ప్రాణాంతకంగా మారే అవకాశం
- నేడు ప్రతి ఆరోగ్య కేంద్రం పరిధిలో అవగాహన ర్యాలీలు, ప్రదర్శనల ఏర్పాటు
- జాతీయ డెంగ్యూ దినోత్సవం నేడు



నీటిలో లార్వాలను గుర్తిస్తున్న వైద్య సిబ్బంది



అక్కయ్యపాలెంలో డెంగ్యూ జ్వరాలపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

సీతంపేట: దోమలు ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులు. దోమ కాటు వల్ల వచ్చే వ్యాధుల్లో డెంగ్యూ అత్యంత ప్రమాదకరమైనది. సరైన సమయానికి రోగ నిర్ధారణ, చికిత్స జరగకపోతే మరణానికి దారి తీసే ప్రాణాంతకమైన జ్వరంగా చెప్పవచ్చు. గత కొద్ది సంవత్సరాలుగా మలేరియా జ్వరాలు తగ్గుముఖం పడుతుంటే, దాని స్థానంలో డెంగ్యూ జ్వరాలు ఎక్కువగా వ్యాపిస్తున్నాయి. ఏడిస్ ఈజిప్టి (టైగర్ మస్కిటో) కుట్టడం వల్ల జ్వరంతో కూడిన కీళ్ల నొప్పులు, కండరాల నొప్పులు, కంటి లోపల భాగంలో నొప్పి, కనుగుడ్డు కదల్చలేనంత నొప్పి, వాంతులు, శరీరంపై ఎర్రటి దద్దుర్లు ఉంటే డెంగ్యూ జ్వరంగా అనుమానించవచ్చు. టైగర్ మస్కిటోపై తెల్లటి చారలు, చుక్కలు ఉంటాయి. పగటిపూట కుడుతుంటాయి. డెంగ్యూ వైరస్ ఇన్ఫెక్ట్ అయిన దోమ కుట్టిన తర్వాత 3 నుంచి 14 రోజుల్లో జ్వరం రావచ్చు. డెంగ్యూ జ్వరం బారిన పడిన వారి రక్తంలో ప్లేట్‌లెట్ల సంఖ్య బాగా తగ్గుతుంది. ఇటువంటి వారికి ఆస్పత్రిలో చికిత్స అవసరం.

చెక్, క్లీన్, కవర్.. స్టెప్స్ టు డిఫీట్ డెంగ్యూ..

ప్రతి ఏడాది మే 16వ తేదీన డెంగ్యూ జాతీయ దినోత్సవంగా పాటిస్తూ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మూడు పద్ధతులు పాటించండి, డెంగ్యూని ఓడించండి అనే థీమ్‌తో డెంగ్యూ దినోత్సవం జరుపుకుంటున్నారు.

- **పరిశీలించండి:** ఇంటి చుట్టుపక్కల దోమలు ఉత్పత్తి అయ్యే నీటి నిల్వలు ఉన్నాయేమో చూడండి
- **శుభ్రం చేయండి:** అటువంటి నీటి నిల్వలను శుభ్రం చేయండి లేదా తొలగించండి
- **మూతలు పెట్టండి:** నీరు నిల్వ ఉంచే గోలాలు, డ్రమ్ములు, ట్యాంకులపై మూతలు ఉంచాలి.

ఈ మూడు పద్ధతులు పాటించడం ద్వారా డెంగ్యూ జ్వరాలను అదుపు చేయడానికి వైద్య ఆరోగ్య శాఖ సమాయత్తం అవుతోంది.

నిర్ధారణ పరీక్షలు..

డెంగ్యూ జ్వరం నిర్ధారణకు మాక్ ఎలీసా పరీక్ష చేయించాల్సి ఉంది. కేజీహెచ్ మైక్రో బయాలజీ విభాగంలో డెంగ్యూ నిర్ధారణ పరీక్ష ఉచితంగా చేస్తున్నారు. డెంగ్యూ లక్షణాలు ఉన్నవారు కేజీహెచ్‌లోని రాజేంద్రప్రసాద్ వార్డులో గల ప్రత్యేక కౌంటర్ వద్ద రక్త నమూనా ఇవ్వొచ్చు. వ్యాధి నిర్ధారణ అయితే సమాచారం ఇస్తారు. అలాగే పట్టణ ఆరోగ్య కేంద్రాలలో డెంగ్యూ ఆర్‌డీటీ కిట్ పరీక్ష అందుబాటులో ఉంది. కిట్‌తో జ్వర నిర్ధారణ నిమిషాల్లో తెలుసుకోవచ్చు.



డెంగ్యూ నివారణకు తీసుకునే చర్యల గురించి అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



నీటి నిల్వలను పరిశీలిస్తున్న సిబ్బంది



ఫాగింగ్ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

నివారణ చర్యలు..

డెంగ్యూ జ్వరాలను వ్యాప్తి చేసే టైగర్ మస్కిటో నియంత్రణకు ఇంటి లోపల, పరిసరాలలో నీరు నిల్వ లేకుండా చూడాలి

- వారానికి ఒకరోజు డ్రై డే పాటించాలి. నీటిని నిల్వ చేసే పాత్రలు, కుండీలు, గోలాలు శుభ్రం చేసి మరల నీటిని పట్టుకోవాలి
- సంపులు, ఓవర్ హెడ్ ట్యాంకులు, గోలాలు, కుండీలు, డ్రమ్ములపై మూతలు ఏర్పాటు చేయాలి.
- ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, డెంగ్యూ దోమల ఉత్పత్తిని అరికట్టడంలో భాగస్వామ్యం కావాలి
- డెంగ్యూ నియంత్రణకు ఆరోగ్య శాఖ, జీవీఎంసీ సంయుక్తంగా చేపట్టే ఇంటింటా నీటి నిల్వ పరిశీలన, ఫ్రైడే డ్రైడే, ఫాగింగ్, స్ప్రేయింగ్, హెల్త్ క్యాంపులు, అవగాహన కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలి.
- దోమకాటు నుంచి రక్షణకు దోమ తెరలు వాడాలి, కిటికీలకు మెస్‌లు ఏర్పాటు చేసుకోవాలి

జీవీఎంసీ జోన్-5లో డెంగ్యూ కేసుల వివరాలు

సంవత్సరం	డెంగ్యూ బాధితుల సంఖ్య
2018	265
2019	134
2020	33
2021	270
2022	224
2023	252
2024	156
2025(మే 15 వరకు)	16

ప్రతి శుక్రవారం డ్రై డే..



జోన్ పరిధిలో ప్రతి సచివాలయం పరిధిలో ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పటిష్టంగా నిర్వహిస్తున్నాం. జిల్లా మలేరియా విభాగం, జీవీఎంసీ యాంటీ లార్వా సిబ్బంది. హెల్త్ సెక్రటరీలు, ఆశ వర్కర్లు బృందాలుగా ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వలు పరిశీలించి దోమ లార్వాలను నాశనం చెయ్యడం, నీటిలో టెమోఫాస్ వంటి మందులు కలపడం చేస్తున్నారు, అలాగే గతంలో డెంగ్యూ జ్వరాలు సంభవించిన ప్రాంతాలను హాట్ స్పాట్లుగా గుర్తించి ముందస్తు నివారణ చర్యలుగా ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయిస్తున్నాం. నీటి కుంటలు, ఫాంటెయిన్లు, నూతుల్లో గంభూషియా చేపలు, ఆయిల్‌బాల్స్ వేయిస్తున్నాం. దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– సునీల్ కుమార్, సహాయ వైద్యాధికారి, జోన్-5

ధ్యాన మందిరంలో ప్రత్యేక పూజలు



బాబాకు పూజలు చేస్తున్న అర్చకులు



పూజల్లో పాల్గొన్న భక్తులు

తాటిచెట్లపాలెం : రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఎదురుగా ఉన్న షిర్డీ సాయిబాబా ధ్యానమందిరంలో గురువారం ఉదయం నుండి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం హారతి అనంతరం ధ్యాన మందిరం ఆవరణలో భక్తులు, పేదలకు, యాచకులకు భారీ అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు మాట్లాడుతూ భక్తులు, దాతల సహకారంతో నిత్యాన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతే కాకుండా ఏ సమయంలోనైనా ఆకలితో ఉన్నవారి ఆకలి తీర్చేందుకు కమ్యూనిటీ ఫ్రిడ్జ్‌లో ఆహారం ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన వారు దాన్ని తీసుకుని తమ ఆకలి తీర్చుకుంటున్నట్లు తెలిపారు. సాయంత్రం నుండి బాబా భజన, హారతి కార్యక్రమాలతో పాటు పల్లకీ సేవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో త్రిపురాన రాంబాబు, ఇతర ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 జ్ఞానాపురం పరిధి జోనల్ కార్యాలయంలో మలేరియా విభాగంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా తదితర సీజనల్ వ్యాధుల నివారణపై గురువారం మలేరియా ఇన్‌స్పెక్టర్ నల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్ అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ విధుల్లో సమయపాలన పాటించాలని, తమ వార్డుల్లో ఉన్న ప్రజలతో మాట్లాడి సీజనల్ వ్యాధుల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించాలని తెలిపారు. యాంటీ లార్వా ఆపరేషన్‌ను పక్కాగా నిర్వహించాలని, ఇళ్లలో వాటర్ కంటైనర్లతో పాటు నీటి నిల్వలను గుర్తించి వాటిని తొలగించాలన్నారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వ్యాధులు కలగజేసే దోమలను నిర్మూలించాలని పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం, ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ (ఎస్ఎస్) జనార్దన్, మలేరియా సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాధవస్వామి ఆలయంలో పాము హల్‌చల్



ఆలయంలోకి వచ్చిన పామును కర్రతో పట్టుకుంటున్న దృశ్యం

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధారలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ మాధవస్వామి ఆలయంలో గురువారం పాము హల్‌చల్ చేసింది. ఆలయ అర్చకుడు సనపల రవీంద్ర కుమార్ ప్రతి నిత్యం చేసే పూజల్లో భాగంగా పూజ చేస్తుండగా ఒక్కసారిగా అమ్మవారి విగ్రహం పక్కనే కొండచిలువ ప్రత్యక్షమయింది. వెంటనే శివాలయం అర్చకుడు శ్రీనివాస్‌శర్మకు చెప్పడంతో అతను మాధవస్వామి గర్భ గుడిలోకి చేరుకుని ఒక పెద్ద కర్ర సహాయంతో పామును పట్టుకుని దాన్ని పక్కనే ఉన్న తోటలో వదిలేశారు. అక్కడే ఉన్న భక్తులు కొంత భయభ్రాంతులు చెందినప్పటికీ, సెల్‌ఫోన్ కెమెరాల్లో బంధించారు. ఆలయంలో ఉన్న సొరంగ మార్గం ద్వారా పలుమార్లు పాములు ఆయలంలోకి వచ్చిన సందర్భాలు ఉన్నాయని అర్చకులు తెలిపారు.

17 నుంచి ఆయుర్వేద వైద్య శిబిరం



డాక్టర్ కె.ఎం.ఉన్నికృష్ణన్

మహారాణిపేట: ఆయుర్వేద పంచకర్మ విధానం ద్వారా దీర్ఘకాల రోగాలకు చికిత్స అందించేందుకు ఈనెల 17 నుంచి 21 వరకు కేరళకు చెందిన ప్రసిద్ధ వైద్యులచే ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు కేరళ ఆయుర్వేద కేంద్రం వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినూప్ తెలిపారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కేఎం ఉన్నికృష్ణన్ నాయర్ ఐదు రోజుల పాటు ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. హైపర్ టెన్షన్ (ఆందోళన), ఆర్థ రైటిస్ (కీళ్లవ్యాధులు), పక్షవాతం, నడుం నొప్పి, స్పాండిలైటిస్, మానసిక వత్తిడి, నిద్రలేమి, రుమాటిజం వంటి సమస్యలతో బాధపడే వారికి ప్రత్యేక వైద్య శిబిరంలో డాక్టర్ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. 17,18,19 తేదీల్లో మురళీనగర్ లోనూ, 20, 21 తేదీల్లో రామ్‌నగర్‌లో డాక్టర్ అందుబాటులో వుంటారన్నారు. అపాయింట్మెంట్ కోసం రామ్‌నగర్‌లోని జీవీఎంసీ గేటు ఎదురు లైన్‌లో లేదా మురళీనగర్ శ్రీదేవి పార్క్ వద్ద గల తమ కేంద్రాల్లో సంప్రదించవచ్చన్నారు. 8008000670 నంబర్‌లో అందుబాటులో ఉంటారని తెలిపారు.

'డీడీ నెక్స్ట్ లెవెల్' చిత్రాన్ని నిలిపివేయాలి

అక్కిరెడ్డిపాలెం: తమిళ డబ్బింగ్ సినిమా 'డీడీ నెక్స్ట్ లెవెల్'లో కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి గోవింద నామాలను వక్రీకరించారని ఆరోపిస్తూ గురువారం బీజేపీ ధార్మిక సెల్ అధ్యక్షుడు విజయ్ శంకర్ ఫణి ఆధ్వర్యంలో గాజువాక సీఎంఆర్ సెంట్రల్ మేనేజర్ వర్మను కలిసి శుక్రవారం విడుదల కానున్న ఈ చిత్రాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గాజువాక సీఐ ఎ. పార్థసారథికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా విజయ్ శంకర్ ఫణి మాట్లాడుతూ హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా 'డీడీ నెక్స్ట్ లెవెల్' సినిమాలో ఒక పాటను అర్థం మార్చి, హేళనగా డీజేతో కూడిన పాటను చిత్రీకరించారని తెలిపారు. వెంటనే సినిమా విడుదలను ఆపేయాలని డిమాండ్ చేశారు. సినిమాను ఆపకపోతే హిందువులంతా కలిసి ధర్నా చేస్తామని హెచ్చరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన గాజువాక సీఐ..సీఎంఆర్ మేనేజర్ వర్మతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిమెర శ్రీనివాసరావు, కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, ధార్మిక సెల్ ప్రతినిధులు అభిరామ్, శేషులత పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



నెల్లిముక్కు అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాస్

పెదగంట్యాడ: బడి ఈడు పిల్లలందరినీ తప్పనిసరిగా బడిలో చేర్పించాలని జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఏఎల్ఎస్ అధికారి జి. శ్రీనివాస్ అన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ ఆదేశాల మేరకు ఆయన మండలంలోని నెల్లిముక్కు, గొడ్డువానిపాలెం అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, బడికి వెళ్లకుండా బయట పనుల్లో ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేందుకు ఇంటింటా సర్వే నిర్వహించాలని సూచించారు. తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యతను, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుబాటులో ఉన్న అన్ని రకాల మౌలిక వసతులను వివరించాలని ఉపాధ్యాయులకు తెలిపారు. తమ పిల్లలను పనులకు పంపకుండా బడికి పంపి వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేయాలని తల్లిదండ్రులను కోరారు. ఐదేళ్లు నిండిన పిల్లలందరినీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో, అంతకు మించిన వయస్సు ఉన్నవారిని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చేర్పించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం, అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు ఇమండి శ్రీనివాస్, కంకటాల రమణాజీ, సిబ్బంది వేణుశ్రీ, రామలక్ష్మి, ఝాన్సీరాణి, రమణ, సౌజన్య పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం



చిన్నారులతో డ్యాన్స్ చేయిస్తున్న గ్రంథాలయ అధికారి

అక్కిరెడ్డిపాలెం: గాజువాక శాఖా గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభమైంది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి చిన్నారులతో డ్యాన్సులు, కథలు చెప్పడం, చదివించడం, వాటి అర్థాలు వివరించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు వేసిన డ్యాన్సులు అందరినీ ఆకట్టుకున్నాయి. పూర్వకాలంలో అమ్మమ్మలు, తాతయ్యలు చెప్పే నీతి కథల సంస్కృతి తగ్గిపోవడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గ్రంథాలయ అధికారి పిల్లలకు మిఠాయిలు పంచారు.

కళాకారులను ప్రోత్సహించాలి



కళాకారిణి రత్నశ్రీని సత్కరిస్తున్న మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, కార్పొరేటర్ ముత్యాలు

అగనంపూడి: కళాకారులకు గుర్తింపునివ్వడంతో పాటు వారిని ప్రోత్సహించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలు అన్నారు. 88వ వార్డు వెదుళ్లనరవ ముత్యాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా కడప సత్యసాయి కళామండలి ఆధ్వర్యంలో భక్త చింతామణి నాటకం ప్రదర్శించారు. ఈ సందర్భంగా చింతామణి పాత్రధారిణి సువర్ణకు అష్టకంకణం కందుకూరి పురస్కారం, మహానటి సావిత్ర బిరుదాంకితురాలు జి. రత్నశ్రీని ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, పౌరాణిక నాటకాలు, కళాకారులు కనుమరుగయ్యే పరిస్థితి ఉందని, వారిని ఆదుకోవడానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. కళాకారిణి రత్నశ్రీ మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా వివిధ రాష్ట్రాల్లో మూడు వేలకు పైగా నాటకాలు ప్రదర్శించానని, చింతామణి, సత్యభామ, చంద్రమతి పాత్రల్లో నటించడంతోపాటు కొన్ని సినిమాల్లో కూడా నటించానని తెలిపారు. కళాకారులను ఈ విధంగా గుర్తించి సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సర్వసిద్ధి బొరయ్యనాయుడు, విందుల వరహాలు, బలిరెడ్డి సత్యనారాయణ, మోటూరి వెంకటరమణ, సారిపల్లి అన్నాజీరావు, పోలారావు, సీతయ్య పాల్గొన్నారు.

డీఆర్ఎం దృష్టికి దువ్వాడ రైల్వేస్టేషన్ సమస్యలు



డీఆర్ఎంకు వినతిపత్రం అందిస్తున్న తూర్పు కోస్తా రైల్వే జోనల్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు

అగనంపూడి: దువ్వాడ రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలు, సౌకర్యాలు ఇతర వసతులను స్వయంగా పరిశీలించేందుకు దువ్వాడ రైల్వేస్టేషన్‌ను సందర్శించాలని వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) లలిత్ బొహ్రాను తూర్పు కోస్తా రైల్వే జోనల్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ కోరారు. డీఆర్ఎం కార్యాలయంలో లలిత్ బొహ్రాను కలిసి పలు సమస్యలపై చర్చించినట్లు ఆయన తెలిపారు. వాల్తేరు-సికింద్రాబాద్‌ల మధ్య నడుస్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు దువ్వాడ రైల్వే స్టేషన్‌లో హాల్ట్ ఇవ్వాలని, అదేవిధంగా వందే భారత్ రైళ్లలో స్లీపర్ క్లాస్ కోచ్‌లు ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా, విశాఖ నుంచి కొల్లాం, షిర్డీ, గాంధీధామ్, వారణాసి, చెన్నైలకు వారాంతపు ప్రత్యేక రైళ్లను ప్రతిరోజు నడపాలని, ప్రస్తుతం విశాఖ-తిరుపతిల మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్‌లో కేవలం 11 కోచ్‌లు మాత్రమే ఉన్నందున, థర్డ్ ఏసీ, సెకండ్ ఏసీ అదనపు కోచ్‌లు ఏర్పాటు చేయాలని ఆయన డీఆర్ఎం బొహ్రాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె. సందీప్, బి. వెంకట్ పాల్గొన్నారు.

జీవ వైవిధ్యంపై పోటీలు

గోపాలపట్నం: విద్యార్థుల్లో ప్రకృతిపై అవగాహన పెంచడానికి ఇటువంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ అన్నారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీలలో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ, జీవవైవిధ్యం పట్ల విద్యార్థులకు మంచి అవగాహన ఉందని, వారి ఉత్సాహంగా పాల్గొనడమే అందుకు నిదర్శనమని చెప్పారు. ఈ జీవ వైవిధ్యాన్ని కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. పక్షులు, జంతువులు, చెట్లు ఒకదానిపై మరొకటి ఆధారపడి జీవించడమే జీవవైవిధ్యమని ఆయన వివరించారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు జరిగిన ఈ పోటీలలో 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. 'ప్రకృతితో సామరస్యం, సుస్థిర అభివృద్ధి' అనే అంశంపై వ్యాసరచన పోటీ, 'ప్రకృతిని-జీవవైవిధ్యాన్ని రక్షించు' అనే అంశంపై చిత్రలేఖనం పోటీ, 'ప్రపంచ జీవవైవిధ్యం -పరిరక్షణ' అనే అంశంపై క్విజ్ పోటీ నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.